ప్రజాశక్తి

బుధవారం 17 జనవరి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పురపాలక మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని అనకర్లపూడి గ్రామంలో జగనన్న లేఅవుట్ వద్ద నూతనంగా నిర్మించిన చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మొట్టమొదట కొండపి మండలం అనకర్లపూడి గ్రామ నుంచే మొదలు పెడతానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కొండపిలో నివాసం ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, వైస్ ఎంపిపి వేముల వెంకటప్రసాదు, గ్రామ సర్పంచి వేముల దనలక్ష్మి, వైసిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో కొనసాగుతోన్న అనిశ్చితి

- పట్టాలు ఇచ్చే వరకూ ఒంగోలు రానంటోన్న బాలినేని
- నాలుగోజాబితాపై ఉత్కంఠ
- సంక్రాంతి సంబరాలకు దూరంగా నేతలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

పాలకపక్షంలో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. ఇంకా అయోమయ పరిస్థితులు వీడలేదు. మూడు జాబితాల్లో నాలుగు స్థానాలకు అభ్యర్థులను వెల్లడించిన వైసిపి అధిష్టానం నాలుగోజాబితాపై కసరత్తు చేస్తోంది. పండుగ కావడంతో ఈ మూడు రోజులుగా రాజకీయ వ్యవహారాలపై ముఖ్యనేతలు దృష్టి సారించలేదు.కీలక నేతలు కూడా ఇక్కడెవరూ అందుబాటులో లేరు. సంక్రాంతి సంబరాలకు కూడా దూరంగానే ఉన్నారు. ఎలాంటి స్పష్టత లేకపోవడం..వారి సిఫార్సులను పక్కనబెట్టడంతో నేతల్లో సందిగ్ధం కొనసాగుతోంది. టిక్కెట్‌పై ఆశతో ఉన్న నేతలు నాలుగో జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. టిక్కెట్ కోల్పోయిన నేతలూ నియోజకవర్గాలకు దూరంగానే ఉన్నారు. పార్టీపై అసంతృప్తితో కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. అంతా నిర్లిప్తత కొనసాగుతోంది. ఇక మాజీ మంత్రి బాలినేని హైదరాబాదులోనే ఉన్నారు. నెలరోజులుగా ఆయన జిల్లాకు దూరంగా ఉన్నారు. రెండు కీలక ఎజండాలతో ఆయన అధిష్టానంపై నిశ్శబ్దయుద్ధం చేస్తున్నారు. ఎంపీ మాంగుటకు తిరిగి టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఒంగోలులో ఇళ్ల స్థలాలకు నిధులు కేటాయించాలనే డిమాండ్లను ఆయన చాలా కాలంగా సిఎం జగన్ వద్ద ఉంచారు. మాగుంటకు టిక్కెట్‌పై ఈపాటికే స్పష్టత ఇచ్చారు. ఆయనకు టిక్కెట్ నిరాకరించారు. బాలినేనికే చెప్పారు. వారం రోజులపాటు తర్జనభర్జనలు పడ్డ బాలినేని ఇపుడు ఎంపీ టిక్కెట్‌పై పట్టు వీడారు. చేసేదేమీ లేదనే భావనలోకి వచ్చేశారు. ఎంపీ మాగుంట విషయాన్ని ఇపుడు పక్కనపెట్టారు.వీరిద్దరూ కలిసి ఒంగోలులో పోటీచేయడం సాధ్యం కాదని తెల్చుకున్నారు. ఇపుడు మిగతా ఎజండాలపై దృష్టి సారించారు. ఒంగోలులో 25వేల మందికి ఇళ్ల స్థలాలకు నిధులపై ఉన్నారు. నిధులు ఇస్తేనే ఒంగోలు వెళతామని పార్టీ పెద్దలకు తెగేసి చెప్పారు. ఆయన కుమారుడు కూడా ఒంగోలులోజరిగే చిన్నచిన్న వేదికల్లో ఇదే విషయం ▶ 2లో

ఎడ్లపోటీలు ప్రారంభం

8లో

సంక్రాంతి పండుగ సందర్భంగా ఒంగోలులో మంగళవారం రాత్రి పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొని మాట్లాడారు.

ప్రజాశక్తి-ఒంగోలు

వైభవంగా తెప్పోత్సవం

8లో

అంగన్‌వాడీల పట్ల

ప్రభుత్వ వైఖరి సరికాదు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వ మొండి వైఖరి సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. అంగన్‌వాడీలు రూ.26 వేల కనీస వేతనం అడుగుతుంటే ప్రభుత్వం పెంచకుండా మొండిగా వ్యవహరిస్తుందన్నారు. క్రిస్మస్, జనవరి ఫస్ట్, సంక్రాంతి పండుగలను రోడ్లపైనే జరుపుకునే పరిస్థితి ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 36వ రోజుకి చేరుకుంది. ఈ కార్యక్రమానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ అధ్యక్షత వహించారు. సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షలను ప్రారంభించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ .అంగన్‌వాడీలు జీతాలు పెంచమని అడుగుతుంటే జులైలో పెంచుతామని ప్రభుత్వం చెబుతుందని, ఎంత పెంచుతుందో జీవో ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల ఉసురు ప్రభుత్వానికి తగలకుండా ఉండాలంటే వెంటనే వారి సమస్యలపై ప్రభుత్వం చర్చలకు పిలిచి ముఖ్యమంత్రి మాట్లాడాలని, నిర్దిష్టమైన జీవో ఇవ్వాలన్నారు. జీవో ఇచ్చే వరకు అంగన్‌వాడీల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ శ్రీనివాసరావు గారెలు వండి నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ వేతనాలు పెంచుతామని ప్రభుత్వం చెబుతుందని, జీవోలు మాత్రం ఇవ్వటం లేదన్నారు. ఆరునెలకు ఒకసారి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వేతనాలు మాత్రం ఐదు సంవత్సరాలకు ఒకసారి పెంచుతామంటున్నారన్నారు. అంగన్‌వాడీలు పట్టుదలగా పండగ అయినా వచ్చి పోరాటం చేస్తున్నారని, వారికి అండగా ఉంటామన్నారు. అనంతరం కోటి సంతకాల సేకరణలో భాగంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండా రెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, కాలం సుబ్బారావు, తంబి శ్రీనివాసరావు, టి.మహేష్, సిపిఎం నాయకులు సంతకాలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రమేష్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు కెవి.సుబ్బమ్మ,ప్రశాంతి,హేమీమా, నిర్మల జ్యోతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న డి. రమాదేవి

మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు

జగన్‌కు తిరోగమనం తప్పదు

బాపట్ల : అంగన్‌వాడీల ఆకలి కేకలు వినిపించని బధిర ముఖ్యమంత్రి జగన్‌కు తిరోగమనం తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. సమ్మె శిబిరాన్ని రమాదేవి మంగళవారం సందర్శించి అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ఆకలి కేకలు ముఖ్యమంత్రికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. మాట తప్పిన ముఖ్యమంత్రిగా చరిత్రహీనులుగా నిలిచిపోతారన్నారు. మొండి వైఖరి అవలంబిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఈసారి తగిన శాస్తి జరుగుతుందన్నారు. కుటుంబ ▶ 2లో

వైసిపిలో కొనసాగుతోన్న అనిశ్చితి

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నారు. పట్టాలు ఇస్తే ఒంగోలులోనే పోటీ చేస్తామని బాలినేని స్పష్టంగా చెబుతున్నారు. సింఎ జగన్ మాత్రం గిద్దలూరులో పోటీ చేయాలని చెప్పగా అందుకూ అంగీకారంగానే ఉన్నారు. ఇపుడు సిఎం జగన్ ముందుగా చెప్పినట్లు గిద్దలూరుకే పంపుతారా?లేక పట్టాలకు నిధులు ఇచ్చి ఒంగోలులోనే పోటీచేసే అవకాశం కల్పిస్తారా?అనేది రెండు మూడురోజుల్లో తేలనుంది.సిఎంఒ నుంచి అధికారులకు ఇచ్చిన సమాచారం మేరకు రేపోమాపో నిధులు వస్తాయని గట్టిగా ఆశతో ఉన్నారు. పట్టాలు ఇవ్వకుంటే ఒంగోలులో పోటీచేయడం సాధ్యం కాదనే భావనలో బాలినేని ఉన్నారు. పట్టాలు ఇవ్వకుండా పోటీచేస్తే ఎన్నికల్లో ప్రజలతోపాటు తనపై పోటీచేసిన పార్టీల అభ్యర్థులు చేసే విమర్శలకూ ఇబ్బందిపడాల్సి వస్తుందనే ఆలోచనలో ఉన్నారు. జనానికి మాట ఇచ్చాకదా? దాన్ని నిలుపుకోకుంటే ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.ఇక మిగిలిని నాలుగుస్థానాల్లో అభ్యర్థుల వ్యవహారం కూడా పెండింగులోనే ఉంది. కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం తోపాటు ఒంగోలులో అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. నాలుగో జాబితాలో ఇవి ప్రకటిస్తారా?లేదా?అనేది ఉత్కంఠగా ఉంది. ఒంగోలు, గిద్దలూరు బాలినేని నిర్ణయంతో ముడిపడి ఉన్నాయి.ఈ రెండింటిలో ఒకచోట బాలినేని పోటీచేస్తే మిగతాచోట కొత్త అభ్యర్థిని బరిలోకి దింపాల్సి ఉంది. మార్కాపురంలో జంకె వెంకటరెడ్డి పేరు దాదాపుగా ఖరారైంది. మూడో జాబితో రావాల్సి ఉండగా బాలినేని వ్యవహారంతో ఆగిపోయిందని సమాచారం. బాలినేని గట్టిగా కోరడంతోనే మార్కాపురంలో జంకె పేరు జాబితా వరకూ వచ్చింది. ఆఖరు నిమిషంలో ఆగిపోయింది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కూడా తిరిగి ప్రయత్నాల్లో ఉన్నారు. మార్కాపురం కాకుంటే కనిగిరి నుంచి కూడా అవకాశం కల్పించాలని నాగార్జునరెడ్డి కుటుంబం నుంచి అధిష్టానం పెద్దలపై ఒత్తిడి చేస్తున్నారు. వీరిని పక్కనబెడతారా? ఎక్కడైనా అవకాశం కల్పిస్తారా?అనేదీ చూడాలి. కనిగిరిలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రాకే అవకాశాలున్నాయని మొదటి నుంచీ చర్చ ఉన్న సంగతి తెలిసిందే. మార్కాపురం ఎమ్మెల్యే కూడా ఈ సీటు కోరడంతో సందిగ్ధం నెలకొంది. ఎవరికి ఇక్కడ ఇస్తారనేదీ చూడాలి. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి కూడా బాలినేని అండతో కనిగిరి,గిద్దలూరుపై ఆశల్లో ఉన్నారు. ఎక్కడో చోట అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ప్రకాశంలో కందుకూరు స్థానంపైనా మార్పులపై చర్చ సాగుతోంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే మహీధర్ స్పందిస్తూ పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా సహకరిస్తామన్నారు. అధిష్టానంతో ఎలాంటి విభేదాల్లేవని వ్యూహాత్మకంగా మాట్లాడారు. ఆయనకే తిరిగి ఇస్తారా?లేక కొత్తవారిని పెట్టాలనే ఆలోచనలో ఉంటే బీసీవర్గాల నుంచి వినిపిస్తోన్న బొట్ల రామారావుకు అవకాశం కల్పిస్తారా అనేదీ తేలాల్సి ఉంది. ఎంపీ మాగుంట భవిష్యత్‌పై తర్జనభర్జనలు పడుతున్నారు. వైసిపిలో టిక్కెట్ లేదని తేల్చడంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. ఏటా సంక్రాంతి రోజున ఇక్కడే ఉండే ఆయన ఈసారి దూరంగానే ఉన్నారు. ఏదేమైనా బాలినేని పట్టాలు వ్యవహారం తేలితే అన్నీ కొలిక్కివస్తాయనే చర్చ వైసిపిలో సాగుతోంది.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-కొమరోలు: కొమరోలులో గిద్దలూరు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కొమరోలు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఈ పోటీలు నిర్వహించారు. టిడిపి కొమరోలు మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతిగా గిద్దలూరు టీమ్ రూ.10,000, రెండో బహుమతిగా ఎగెనపల్లె టీమ్ రూ.6,000, మూడో బహుమతిగా ఓబుల్‌రెడ్డి పల్లె టీమ్ రూ.5,000 గెలుచుకున్నాయి. మొదటి బహుమతి బోనేని వెంకటేశ్వర్లు, పందనబోయిన భూపాల్, రెండో బహుమతి పందనబోయిన తిరుమలయ్య, తమ్మిశెట్టి నరేంద్ర, మూడో బహుమతి పందనబోయిన మహేష్, యారవ అంజి అందజేశారు. బాలరాజు, ఆవులయ్య, కొండయ్య, నారాయణ, చిన్న తిరుమలయ్య, రాజగోపాల్, రామరాజు, బాలకృష్ణ, కళ్యాణ్, ఆవులయ్య, ప్రతాపరెడ్డి, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం

36వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-కొండపి

అంగన్వాడీ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడతాం అని కొండపి మండల అంగన్వాడీ యూనియన్ నాయకులు తెలిపారు. మంగళవారం కొండపి తహశీల్దారు కార్యాలయం ఎదుట 36వ రోజు అంగన్వాడీ సమ్మె కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు వినూత్న రూపంలో నిరసన తెలిపారు. రోడ్డుపైనే సంక్రాంతి ముగ్గులు వేసి తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడతాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు, కార్య కర్తలు, ఆయాలు, సిఐటియు నాయకులు వందనం, వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు కెజి మస్తాన్ పాల్గొన్నారు.

మద్దిపాడు: మద్దిపాడులోని దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెను సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ సమ్మెను కొనసాగిస్తామని వారు తెలిపారు. శిబిరంలో అంగన్వాడీలు హాజరయ్యారు.

నాగులుప్పలపాడు: అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికీ 36వ రోజుకు చేరింది. మూడు రోజుల పాటు పిల్లలు, బంధువులతో కలిసి చేసుకొనే తెలుగువారి పెద్దపండగ అయిన సంక్రాంతికి తమను దూరం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకటసుబ్బమ్మ, దుర్గాభవాని, అరుణ, రమ, రజని, వివిధ గ్రామాల అంగన్‌వాడీలు, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీకాంత్ మద్దతు తెలిపారు.

యర్రగొండపాలెం: అంగన్‌వాడీల వేతనాలు పెంచాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలపర్తి డేవిడ్‌రాజు అన్నారు. యర్రగొండపాలెంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 35వ రోజుకు చేరిన సందర్భంగా సోమవారం సంక్రాంతి పండుగను సైతం జరుపుకోకుండా సమ్మెలో కూర్చున్న అంగన్‌వాడీలకు డేవిడ్‌రాజు మద్దతు తెలిపి మాట్లాడారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. పిండి వంటలు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు పాలపర్తి విజేష్‌రాజు, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు, ఏబిసి జిల్లా చైర్మన్ మస్తాన్, నాయకులు చిలకా అనిల్‌కుమార్, దుగ్గెంపూడి బాలకృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్, కొండయ్య, సిఐటియూ జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ, అంగన్‌వాడీ నాయకురాళ్ల మల్లేశ్వరి, పి సుభాషిణి, ఎ నాగమల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు పాల్గొన్నారు.

దర్శిలో ముగ్గువేసి అంగన్‌వాడీల నిరసన

వెలిగండ్ల: అంగన్‌వాడీల సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం కనుమ పండుగ వంటవార్పుతో నిర్వహించారు. ఈ వంట వార్పు కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు సిహెచ్ రఫియా మాట్లాడుతూ ప్రభుత్వం ఆదుకోకపోయినా కూడా అంగన్‌వాడీలు అప్పు తెచ్చుకొని మకర సంక్రాంతి, కనుమ పండుగలు చేశామన్నారు. 35వ రోజు సోమవారం కుర్చీలాట ఆడి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు రాయల మాలకొండయ్య, తాతపూడి ప్రమీల, అరుణకుమారి, సలోమి, ఎస్తేరు, ట్రైని, దీనమ్మ, ఫ్లోరెన్స్, మరియమ్మ, పుష్పలీల, అరుణమ్మ, మిరియాకుమారి తదితరులు పాల్గొన్నారు.

దర్శి: అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, ఆయన మనసు మారాలని అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ అధ్యక్షురాలు తిరుపతమ్మ, బాలమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగమణి, పార్వతి, విజయ, సుశీల, చైతన్యభారతి, వెంకటరమణ, సందు వెంకటేశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని యర్రగొండపాలెంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరింది. కనుమ పండుగను సైతం చేసుకోకుండా అంగన్‌వాడీలంతా సమ్మెలో కూర్చున్నారు. తమ న్యాయమై డిమాండ్లు పర్కిరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు మల్లేశ్వరి, పి సుభాషిణి, ఎ నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పలువురు కోరారు. మంగళవారం పెద్దదోర్నాలలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 35వ రోజుకు చేరింది. కనుమ పండుగను చేసుకోకుండా అంగర్‌వాడీలు సమ్మెలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ మన్మధరావు

చదువు ద్వారానే గ్రామాల్లో మార్పులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

చదువు ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో మార్పులు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మధరావు తెలిపారు. తన సొంత గ్రామమైన శింరాయకొండ మండలం బింగినపల్లి గ్రామంలో గ్రామ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మహిళలు వేసిన ముగ్గురు పరిశీలించి వారిని అభినందించారు. అనంరతం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గ్రామాల్లో చదువుకుని తాను ఈ స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. చదువు ద్వారానే గ్రామాలు అభివద్ధి చెందుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నూకసాని సుబ్బారావు, సర్పంచి జెట్టి విజయలక్ష్మి, పిగిలి కోటేశ్వరరావు, ఆర్. వెంకటేశ్వర్లు, నూకసాని వెంకటేశ్వర్లు దాచూరి రాఘవయ్య, సన్నెబోయిన మాలకొండయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ రివర్స్ పోటీలు

ప్రజాశక్తి-దర్శి: రైతుల కోసం ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించినట్లు వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచే పల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ రోజున స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మరలా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్దఎత్తున ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో రైతులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వైసీపీ నాయకులు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **DIDDALA RAMANA REDDY,** S/o. **DIDDALA KOTIREDDY**, resident of D. No. 1-62, Umamaheswarapuram Village, Mundlamuru Mandal, Prakasam District- A.P., here by declare that my **Father** name is wrongly entered in my SSC Marks memo Regd No: 0918667 is **KOTAREDDY** instead of **DIDDALA KOTIREDDY** due to oversight, and his correct name is **DIDDALA KOTIREDDY.** I here by declare the above particulars are true vide affadavit dated 08-01-2024 before Public Notary, Ongole.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

ఐ.ఎ. నెం: 565/2022 ఇన్
ఓ.ఎస్. నెం: 238/2017

బిట్వీన్:
కందగట్ల ఆదినారాయణ మరియు ఇంకొకరు
... పిటీషనర్లు
వర్సెస్
పోలకొమ్ము కేశవ మరియు ఇంకొకరు
... రెస్పాండెంట్లు

టు,
పోలకొమ్ము కేశవ, తండ్రి: వెంకటేశ్వర్లు
వయసు: 44 సం॥, ఇంటి నెం: 4-150-ఎ,
తాడివీధి, మార్కాపురం పట్టణం,
మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.
రెస్పాండెంట్ 1వ వారికి కోర్టు వారి ఉత్తర్వుల మేరకు.

రెస్పాండెంట్ 1వ వారికి నోటీసు

పైన పేర్కొన్న ఫైనల్ డిక్రీ పిటీషన్ దావాలో హాజరు నిమిత్తం కోర్టు వారి సమక్షంలో 23-01-2024వ తేదీన నీవుకానీ, నీ తరపు వకీలు గానీ పై కోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరై నీ వాదనలు తెలియజేయవలెను. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

వాయిదా: 23-01-2024 — **ఇట్లు**
మార్కాపురం — **సరస్వతి రామరాజు, న్యాయవాది, మార్కాపురం.**

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ వైఖరి సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులతో సంక్రాంతి పండుగ జరుపుకోవాల్సిన అంగన్‌వాడీలు రోడ్లపై కూర్చొని చేస్తున్న నినాదాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అంగన్‌వాడీల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తారని తెలిపారు. అవసరమైతే నిరవధిక నిరాహార దీక్షకు పూనుకోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీలకు సమ్మె శిబిరం వద్ద ఆటవిడుపు కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి రమాదేవి ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో హేమమాలిని, లత, గీత, సీతామహాలక్ష్మి, సామేలు, శరత్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఒంగోలు

గద్దలగుంట గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బహుమతి ప్రధానోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఒడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా ఎంతో వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ నిర్వాహకులను ఆమె అభినందించారు. కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఉన్నతమైన విలువలతో కూడిన జీవన ప్రమాణాలను తల్లిదండ్రులు చిన్నారులకు నేర్పినట్టైతే మనం ఆశించిన మెరుగైన సమాజం చూడవచ్చని అన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, స్థానికుల సహకారంతో గద్దలగుంట పార్క్, మహాప్రస్థానం, ఆరామ క్షేత్రం వంటివే కాకుండా ఇటీవల మహిళల సర్వతోముఖాభివృద్ధికి స్త్రీ శక్తి భవన్ నిర్మించామని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షులు ఓగిరాల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సంక్రాంతి సంబరాలలో నిర్వహించిన అన్ని పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులను మహిళలను, యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, రైజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతకుమారి, ఓరియంటల్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని పద్మావతి, విశ్రాంత పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఈదుపల్లి అంకబాబు, లేళ్ల సుమన్, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చివరగా 14 రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన వందమందికి ఒడా చైర్మన్ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చందు డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన సభికులను ఎంతగానో ఆకట్టుకుంది.

కనిగిరి: కనిగిరి మున్సిపాలిటీ గార్లపేట రోడ్డు వృద్ధుల ఆశ్రమం సమీపంలో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రంగవల్లుల పోటీలను నిర్వహించారు. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని రకరకాల ముగ్గులను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు ఎస్ సుబ్బారెడ్డి ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పీసీ కేశవరావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడారు. 30 కుటుం బాల పేదలకు ఈ సందర్భంగా ఆయన దుప్పట్లను పంపిణీ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పీసీ కేశవరావు మాట్లాడుతూ పోటీలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ఐద్వా నాయకులు ఎస్‌కే బషీరా, శాంతకుమారి, ప్రసన్న, సిఐటియు నాయకులు యు పిచ్చయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని మంగమూరు, పేర్నమిట్ట, ఎనికపాడు గ్రామాలలో పలురకాల ఆటల పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

గద్దలగుంటలో మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు

మంగమూరులో..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా వాలీబాల్, మ్యూజికల్ చైర్స్, తాడాట, ముగ్గుల పోటీలను గ్రామంలోని చింతచెట్టు సెంటర్లో నిర్వహించారు. రాత్రి బాలబాలికలచే జానపద, అభ్యుదయ గీతాలకు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని సుమారు 450 మంది ప్రేక్షకులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు మంచికలపాటి శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, షేక్ నాగూర్, కందుల రవి, టి రాము, అబ్బూరి బసవమ్మ, మంచికలపాటి అంజమ్మ, కందుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

పేర్నమిట్టలో..

సంక్రాంతి సందర్భంగా పేర్నమిట్ట గ్రామంలో జనవిజ్ఞాన వేదిక, సిఐటియు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు, బాలబాలికలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, చెరువుగట్టు, గిరిలో కుండ కొట్టుట తదితర ఆటలను నిర్వహించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు ఉంగరాల భాస్కరరావు, షేక్ అంజయ్య, వెంకటేశ్వరరెడ్డి, మన్నం సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు బివి రమణ, టి సుబ్బారావు, పి శేషయ్య, యు రామకృష్ణ, రైతు సంఘం నాయకులు అన్ను వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎనికపాడులో..

మండలంలోని ఎనికపాడు గ్రామంలో డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాల బాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, జేవీవీ నాయకులు ఎన్‌వి నరసింహం, ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి పాల్గొన్నారు.

సిఎస్ పురం: మండలంలో గత మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాల్లో దేవాలయాల్లో పూజలు నిర్వహించి మొక్కుబళ్ళు తీర్చుకున్నారు. చివరి రోజున పారువేట కార్యక్రమం నిర్వహించారు. వి.బైలు గ్రామంలో శ్రీరాములవారిని పల్లకిపై ప్రత్యేకంగా ఉరేగింపు కార్యక్రమం చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పారువేట కార్యక్రమాలు ఘనంగాజరిగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా అనేక గ్రామాల్లో క్రికెట్ పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పొదిలి: మర్రిపూడి మండలం గుండ్లసముద్రం గ్రామంలో జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త, స్పేస్ విజన్ అధినేత తూమాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పొదిలి తాలూకా స్థాయి ముగ్గుల పోటీలు గుండ్ల సముద్రంలో సోమవారం నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పెద్దఎత్తున మహిళలు రావడంతో నిర్వాహకులు వారికి అభినందనలు తెలియజేశారు. ఈ పోటీలకు రెఫరీగా వాకా సుబ్బారెడ్డి, బరూరి శివయ్య దంపతులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ బహమతిగా కే విజయకు రిఫ్రిజిరేటర్ దక్కింది. మర్రిపూడికి చెందిన ఈదుమూడి కామేశ్వరి రెండో బహుమతిగా వాషింగ్ మిషన్ గెలుపొందారు. మూడో బహుమతి బోగసముద్రం శ్రావణి సాధించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా రంగవల్లులతో పాటు ఏర్పాటు చేసిన జబర్దస్త్ కామెడీ షో ఆర్టిస్ట్ పవన్ రాథోడ్‌చే నిర్వహించిన డాన్స్ ప్రోగ్రాం మండల ప్రజలను అలరించింది. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు తుమాటి వెంకట నరసింహారెడ్డి, ఆవుల సంజీవరెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఆవుల ప్రవీణ్, తుమాటి యశ్వంత్, వాకా సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని శ్రీఅయ్యప్ప దేవస్థానంలో మకర సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. కేరళలోని అయ్యప్ప దేవస్థానంలో ఎలా నిర్వహిస్తారో అదే విధంగా ఇక్కడా నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలో మకరజ్యోతి దర్శనం కూడా ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయదాత తాడువాయి గోపాల మల్లికార్జునరావు వేడుకలను పర్యవేక్షించారు.

పలుచోట్ల సంక్రాంతి వేడుకలు

మార్కాపురం పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో బట్టగిరి శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి ఐకాన్-11 టీం గెలుపొందగా రూ.10,116/- నగదు బహుమతిని గ్రామ సర్పంచి బట్టగిరి గౌతమి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి జవ్వాజి రామాంజులరెడ్డి చేతుల మీదుగా అందించారు. ద్వితీయ బహుమతి జైశ్రీరామ్ టీంకు జార్జి కాలేజ్ స్టాఫ్ రామాంజులరెడ్డి, బట్టగిరి రంగారెడ్డిలు రూ.5,116/- అందజేశారు. అండర్-14లో జై భీమ్ టీం గెలుపొందగా రూ.1,116/- నగదు బహుమతిని పొందారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాచ్‌మెన్, బెస్ట్ ఆల్ రౌండర్‌లకు రూ.2,116/- ముదిరెడ్డి అశోక్‌రెడ్డి అందజేశారు. అనంతరం చిల్లకోటి పోటీలో గెలుపొందిన విజేతలకు ముదిరెడ్డి మల్లికార్జునరెడ్డి రూ.3,116/- బహుమతులు అందజేశారు. దరిమడుగు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

సంక్రాంతి పండగ సందర్భంగా మార్కాపురం మండలం పెద్ద నాగులవరం గ్రామంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించగా గ్రామంలోని యువత, మహిళలు అధికంగా పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య వ్యవహరించారు. విజేతలకు గ్రామ పెద్ద ఓర్సు రమణయ్య బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని తురక వాణి, రెండో బహుమతిని తిరుపతి దుర్గ, మూడో బహుమతిని తురక లల్లి దక్కించుకున్నారు. కబడ్డీ పోటీలో రేపని వెంకటశివసాయి, భవానిశంకర్‌లు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తుల సహకారంతో ఓర్సు అడివయ్య, రేపని తిరుపతయ్య, తురక ఏడుకొండలు, దేరంగుల వెంకటస్వామి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు నిర్వహించారు.

తాళ్లూరు: తాళ్లూరు మండలం తోటవెంగన్నపాలెం గ్రామంలో జనసేన నాయకులు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో మహిళల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి జనసేన ఇన్‌ఛార్జి బొటుకు రమేష్, శేషయ్య, నాయకులు ఏసురెడ్డి, మహిళ అధ్యక్షులు సుజాత బహుమతులు అందించారు.

పేర్నమిట్టలో గిరిలో కుండ కొట్టే ఆట

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని తాటాకులపాలెంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. నిందితుల వద్ద రూ.49,670 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పిసి పల్లి: మండలంలోని బట్టుపల్లి గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు కోడిపందాలు ఆడే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోళ్లను, రూ.2,250 నగదును సీజ్ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏదైనా గ్రామాలలో కోడిపందాలు, పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారాన్ని తమకు అందజేయాలని ఎస్ఐ జి కోటయ్య కోరారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-బాపట్ల

ఆటో డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బాపట్ల-చీరాల రహదారిలో విలియం బూత్ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చీరాల నుంచి బాపట్ల వస్తున్న ఆటో విలియం బూత్ జూనియర్ కళాశాల ఎదురు జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం ఊళ్లపాలెం పంచాయతీలోని దేవలంపల్లిపాలెంలో అక్రమంగా నిల్వ ఉన్న మద్యాన్ని ఎస్ఐ టి శ్రీరామ్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పోలీసులు సముద్రతీర ప్రాంతంలో తనిఖీల నేపథ్యంలో దేవలంపల్లిపాలెంకు చెందిన కారం సుబ్బారావు నిల్వ ఉంచిన 345 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరి వెంట ఏఎస్ఐ ఎస్‌కె మహబూబ్‌బాషా, ఎస్‌కె షాకీర్, సుమన్ ఉన్నారు.

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-పిసిపల్లి: కనిగిరి నియోజకవర్గ స్థాయిలో సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని దివాకర పురంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పెద్దఅలవలపాడు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో దివాకరపల్లి జట్టు, తృతీయ స్థానంలో వితలాపురం జట్టు నిలిచాయి. కోయ వెంకటేశ్వర్లు రూ.15,116 ప్రథమ బహుమతి నగదు అందజేశారు. ఒంగోలులో ప్రముఖ వైద్యులు డాక్టర్ బివిఎస్ వరప్రసాద్ అసుప్రతి అధినేత డాక్టర్ చైతన్య రూ.10,116 అందజేశారు. విఆర్‌ఓ కోటపాటి కోటయ్య తృతీయ బహుమతి రూ.5,016 అందజేశారు. వీటిని సోమవారం సాయంత్రం దివాకర పల్లిలో విజేతలకు అందజేశారు. కబడ్డీలో మంచి ప్రతిభ కనబరిచిన సిహెచ్ ఈశ్వర్ అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలం సుదర్శన్, యేరువ నరసింహం, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పిసిపల్లి

కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో తాలూకా స్థాయి క్రికెట్ ఆటల పోటీలను మండలంలోని పెదఇర్లపాడుకు చెందిన బోధి విద్యాసంస్థ అధినేత కరణం గంగయ్య సోమవారం ప్రారంభించారు. మొత్తం 24 టీములు పాల్గొన్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.15 వేలను అందజేస్తామని తెలిపారు. ద్వితీయ బహుమతి రూ.10 వేలను గంగయ్య అందజేయను న్నారు. తృతీయ బహుమతి రూ.5 వేలను రేగలగుంట వెంకటేశ్వర్లు అందజేయనున్నట్లు తెలిపారు. క్రికెట్ కిట్‌లను కరణం తిరుపతిరావు, గిఫ్ట్‌లను వెంగళాయపల్లి ఉపసర్పంచి కరణం వేమయ్య ఇవ్వనున్నట్లు తెలిపారు.

వైపాలెంలో 'తాటిపర్తి' ఫ్లెక్సీలు చింపివేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో వైసీపీ నూతన సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. యర్రగొండ పాలెంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం పూర్తికాలం మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్‌ను కొండపిలో పోటీ చేయాలని అధిష్టానం ఆదేశించడంతో మంత్రి సురేష్ కొండపి వెళ్లారు. యర్రగొండపాలేనికి నూతన సమన్వయకర్తగా తాటిపర్తి చంద్రశేఖర్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా తాటిపర్తి యర్రగొండపాలెం వస్తుండగా ఆయన రాకను పురస్కరించుకొని యర్రగొండ పాలెంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయం దగ్గర నుంచి మాచర్ల రోడ్డులోని రాళ్లవాగు వరకు ఫ్లెక్సీలు వేశారు. మంత్రి సురేష్‌తో కాకుండా చంద్రశేఖర్ ఒంటరిగానే యర్రగొండపాలెంలో పర్యటించారు. అయితే అందరూ ఆయన రాకను ఆహ్వానించారు. పోటీలు పడి మరి శాలువలు కప్పారు. కాగా ఫ్లెక్సీలు చింపడంతో ఇది ఆకతాయిలు చేసిన పనిగా చర్చ నడుస్తోంది.

పుల్లలచెరువు: పుల్లలచెరువు మండలంలో వైసిపి వర్గపోరు భగ్గుమన్నదా, తాడిపర్తి చంద్రశేఖర్ సంక్రాంతి పండుగ సందర్భంగా పుల్లలచెరువు బ్రహ్మంగారి ఆలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. ఈ ఫ్లెక్సీలను వైసీపీకి చెందిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కానీ మండలంలో అధికార వైసీపీలో రెండు వర్గాలు ఉన్నట్లు పుల్లలచెరువులో చర్చ మొదలైంది. బుధవారం పుల్లలచెరువు రైస్ మిల్లులో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఓ పక్క ఫ్లెక్సీ చింపి వేయడంతో ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తోంది.

తాటిపర్తి చంద్రశేఖర్ ఫ్లెక్సీని చింపిన దృశ్యం

పండుగ రోజూ అంగన్‌వాడీల నిరసన

రేపల్లెలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అద్దంకిలో దీక్షా శిబిరం వద్ద పిండివంటలు తయారీ

ప్రజాశక్తి - రేపల్లె

అంగన్‌వాడిల సమ్మెలో భాగంగా సంక్రాంతి సందర్భంగా దీక్షా శిబిరం వద్ద బండరాయికి పూజచేసి నిరసన వ్యక్తం తెలిపారు. అంగన్‌వాడి సిఐటియు సమ్మె శిబిరం వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుండా బండరాయిలాగే వ్యవహరి స్తుందని అన్నారు. అందరూ పండగ చేసుకుంటుంటే అంగన్‌వాడిలు రోడ్డున పడటం సిగ్గుచేట్టని, రాష్ట్రప్రభుత్వం స్పందించకపోవడం వల్ల మహిళలు పోరాటాన్ని కొనసాగిస్తు రోడ్డు మీదకు నెట్టబడ్డారని అన్నారు. ప్రభుత్వ బెదిరింపులు వల్ల 17నుండి రాష్ట్ర కేంద్రంల్లో నిరవధిక నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోరాటం ఉదృతం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై మేరీమణీ, డి జ్యోతి, లావణ్య, అరుణ, శ్రీలత, ప్రజ సంఘాల నాయకులు కె ఆశీర్వాదం, ఐ లీలకోటేశ్వరరావు, డి.జ్యోతి, లావణ్య, అరుణ, శ్రీలత, నల్లినీ, కెవి లక్ష్మణరావు, కె రమేష్ పాల్గొన్నారు.

కొల్లూరు : అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కనుమ రోజు కూడా సమ్మె నిర్వహించారు. సమ్మె శిబిరంలో భోజనాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన పండుగ రోజు కూడా కొనసాగించారు. దీక్షా శిబిరం వద్దకు వచ్చిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా తాత్సరం చేయడం అన్యాయం అన్నారు. అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగించాలని అన్నారు.

అద్దంకి : అంగన్‌వాడి కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల నిరవధిక సమ్మెలో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె శిభిరంలోనే పిండి వంటలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి తిరుపతిరెడ్డి, గంగాధర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జి శారద, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేస్తున్న అంగనవాడీల నిరవధిక సమ్మె 36వ రోజుకు చేరింది. ఐద్వ రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడారు. సమ్మె పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తక్షణం సమ్మె పరిష్కారం చేయకపోతే ఆందోళన తీవ్రతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు, బి చినదాసు పాల్గొన్నారు.

చీరాల : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా సంక్రాంతి సందర్భంగా కోలాటం, గాలిపటాలు ఎగరేసి నిరసన తెలిపారు. ఇప్పటిదాకా శాంతియుతంగా నిరసన తెలిపామని, తమ వేతన సమస్య పరిష్కారం చేయకపోతే రేపటి నుండి ఆందోళన ఉదృతం చేస్తామన్నారు. షోకాజు నోటీసులు వెనక్కి తీసుకోవాలని, ఎస్మా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండిపొట్టు విడనాడి సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి రేఖ, సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. కార్యక్రమంలో జి సుజీవన, సులోచన, బుల్లెమ్మాయి, పావని, అనిత పాల్గొన్నారు.

కారంచేడు : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా కనుమ పండుగ సందర్భంగా నిరసన కొనసాగించారు. తాము ఆందోళన ప్రారంభించి ఐదు వారాలు గడిచాయని అన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిష్కార మార్గం సూచించకపోగా ఆందోళనను పక్కదారి పట్టించే దిశగా, ఉద్యమాలను అవమానపరిచే విధంగా వైసీపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని అంగన్‌వాడీలు ఆరోపించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన కొనసాగింది.

చెరుకుపల్లి : ప్రజలందరూ పండుగలు చేసుకుంటుంటే అంగన్‌వాడీలను రోడ్డునపడేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. మంగళవారం కనుమ రోజు కూడా తమ నిరసన కొనసాగించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణ, పోలీస్ స్టేషన్ ఎదురుగా ముగ్గులు వేసి తమ నిరసన తెలిపారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక దీక్ష 36వ రోజు కొనసాగించారు. సంక్రాంతి పండుగను సైతం వదిలేసి దీక్ష శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు. పండుగ సందర్భంగా అంగన్‌వాడిల దీక్షా శిబిరం వద్ద రైతు సంఘం నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, కె రామస్వామి స్వీట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడిల డిమాండ్లు పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

చీరాలలో పంతంగులు ఎగురవేస్తున్న అంగన్‌వాడీలు

యద్దనపూడిలో అంగన్‌వాడీల నిరసన

బహుమతులు అందజేస్తున్న డి. రమాదేవి

సంస్కృతిని భావితరాలకు అందించాలి

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు పల్లెల్లో నిర్వహించే ముగ్గులు, ఆటల పోటీలను ప్రోత్సహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి రమాదేవి అన్నారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, సిఐటియు, కెవిపిఎస్, మహిళా సంఘం(ఐద్వా), వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వెదుళ్ళపల్లిలో ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామాల్లో ప్రాచీన కళలను పరిరక్షించడంతోపాటు పాడిపంటలతో కళకళలాడే సంక్రాంతి సంబరాల శోభకు పాడి రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలన్నారు. పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణ మోహన్, సిఐటియు జిల్లా కోశాధికారి తిరుమలరెడ్డి, మహిళా సంఘం ఐద్వా నాయకులు టి సుభాషిని, అంగన్‌వాడి యూనియన్ నాయకురాలు బేబీ రాణి, జెవివి నాయకులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బండలాగుతున్న ఎడ్లజత

ఉత్సాహంగా ఎడ్లపోటీలు

ప్రజాశక్తి - పర్చూరు

అన్నంబొట్లవారిపాలెంలో 36వ జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు 11ఎడ్ల జతలు పోటీ పడనున్నట్లు నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు. ఈనెల 18వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. 22క్వింటాళ్ళ బరువున్న బండరాయిని 25నిమిషాల్లో ఎవరి ఎద్దులు ఎక్కువ దూరం లాగితే వారిని విజేతలుగా ప్రకటిస్తారని తెలిపారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలనుండి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పోటీలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి పోటీల ద్వారా రైతుల్లో పశుపోషణపై ఆసక్తిని పెంచవచ్చని నిర్వాహకులు చెప్పారు.

సిమెంట్ బల్లలు బహూకరించిన రోటరీ ప్రతినిధులు

సిమెంట్ బల్లలు బహూకరణ

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.24వేల విలువచేసే ఆరు సిమెంట్ బల్లలను సోమవారం బహూకరించారు. వీటిలో నాలుగు బెంచీలను కరణం హనుమంతరావు, రెండు బెంచీలను జాగర్లమూడి సుబ్బారావు (జేకేసి) సొంత డబ్బులతో ఏర్పాటు చేశారని తెలిపారు. రోటరీ వాటర్ ప్లాంట్ దగ్గర ఒకటి, ఎంపీడీఒ కార్యాలయం వద్ద ఒకటి, తహశీల్దారు కార్యాలయం వద్ద రెండు, పంచాయతీ కార్యాలయం వద్ద ఒకటి, సినిమా హాల్ సెంటర్లో ఒకటి ఉంచినట్లు రోటరీ అధ్యక్షుడు కరణం హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ షేక్ కాలేషావలి, కోశాధికారి గుర్రం ఆంజనేయులు, డిస్టిక్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, జాగర్లమూడి సుబ్బారావు, రాయిని వెంకటసుబ్బారావు, దొప్పలపూడి రేవంత్, బాచిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐక్యతకు ఆటలు - యువజన మైత్రికి బాటలు

బహుమతులు అందజేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు మణిలాల్

ప్రజాశక్తి - నిజాంపట్నం

ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఐక్యత కొరకు ఆటలు, యువజన మైత్రికి బాటలనే ఉద్దేశంతో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, నిజాంపట్నం ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, వెంకట హరినాథ్ బాబు, గ్రామ పెద్దల సౌజన్యంతో సోమవారం సాయంత్రం ముగ్గుల పోటీలు, ఆటలు పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో మోకా సౌజన్య మొదటి, సున్నంపూడి శ్రీలక్ష్మి ద్వితీయ, మోపిదేవి నాగజ్యోతి తృతీయ బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. పిండి వంటలే కాక మహిళలు ముగ్గులు వేయడం, వాళ్లని ప్రోత్సహించడం సంక్రాంతికి ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ గత 11ఏళ్లుగా గ్రామ పెద్దల సహాయ సహకారాలతో ఎస్ఎఫ్ఐ ముగ్గుల పోటీలు నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలే కాకుండా విద్యార్థులను చదువు, ఆటపాటల్లో ప్రోత్సహించడానికి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మొగదారమ్మ గుడి కమిటీ చైర్మన్ కన్నా శ్రీనివాసరావు, యుటిఎఫ్ నిజాంపట్నం మండల కార్యదర్శి చుక్క బాపయ్య, ఐద్వా డివిజన్ నాయకురాలు ఝాన్సీ రాణి, నిజాంపట్నం నాయకులు ఉషారాణి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్తలు

ముగిసిన నాటికల పోటీలు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామంలో జరుగుతున్న ఎన్‌టిఆర్ కళా పరిషత్ నాటికల పోటీలు సోమవారంతో మద్దినేని బ్రహ్మానందం, శకుంతల కళా నిలయంలో ముగిశాయి. చివరి రోజు పోటీల్లో ఇంద్ర ప్రస్థం, స్వప్నం రాల్చిన అమృతం, రాత నాటికలు ప్రదర్శించారు. పోటీలకు సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి, నటుడు అజయ్ గోష్, గోపి చంద్ హాజరయ్యారు. కార్యక్రమంలో అనంతవరం పరిషత్ అధ్యక్షుడు పాండు రంగారావు, ఆర్ శ్రీను, ఎం కృష్ణ పాల్గొన్నారు.

వరాహపురంలో కోడి పందాల వద్ద గుమికూడిన జనం

వరాహపురంలో కోడి పందాలు

ప్రజాశక్తి - వేమూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు విచ్చలవిడిగా జరిగాయి. మండలంలోని వరాహపురంలో ఎంపీపీ ఎలమాటి మోహన్, వైసీపీ మండల కన్వీనర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు ఆధ్వర్యంలో, కొల్లూరు మండలం పెసర్లంక గ్రామంలో వైసిపి నాయకులు గోపి ఆధ్వర్యంలోనూ, భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామంలో మాజీ ఎంపీటీసీ న్యాయవాది సేరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పందాలు కొనసాగాయి. మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాల పేరుతో జరిగిన ఈ కోడిపందాల్లో రూ.కోట్ల డబ్బు చేతులు మారాయి. రూ.5వేల నుండి రూ.5లక్షల వరకు కోడిపందాల పోటీ జరిగింది. పోటీలకు నాలుగు రకాల బరులను సిద్ధం చేశారు. దీనితోపాటు మూడు ముక్కలాట, కాయ్ రాజా కాయ్, లోన బయట వంటి పేకాటలు కూడా కొనసాగటమే గాక పందెం బరుల వద్ద విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ పందాలను తిలకించటానికి బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మహిళలతో సహా సంక్రాంతి సంబరాల పేరుతో కోడిపందాలు గెలిపించడమే కాక పందాల్లో కూడా పాల్గొన్న దాఖలాలు ఉన్నాయి. మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునతో పాటు అనేక మంది నాయకులు కోడిపందాలను తిలకించిన వారిలో ఉన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో అర్ధవీడు మండలం, పాపినేనిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ మహిళా సర్పంచ్ కొమిరె అచ్చమ్మ, ఆమె భర్త కొమిరె పుల్లారావు, వారి అనుచరవర్గంతో సహా వైసిపిని వీడి మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వ్యవస్థలను నాశనం చేశాడని, సర్పంచుల హక్కులను కాలరాసి అప్రజాస్వామ్య పాలన చేస్తున్నాడని, నాడు తెలుగుదేశం హయాంలో సర్పంచులకు పూర్తి హక్కులను కల్పించి గ్రామాల అభివృద్ధికి పాటుపడితే జగన్ రెడ్డి గ్రామాలనూ చిన్నచూపు చూశాడన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ పతనానికి నేటి నుంచే అడుగులు మొదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన మీనిగె పెద్ద కంభగిరి, చిన్న కంభయ్య, గోరా ఆంజనేయులు, కొమిరె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల విషయంలో..

ఒంటెద్దు పోకడలకు పోవద్దు: వియస్ఆర్

ప్రజాశక్తి-పొదిలి

ముఖ్యమంత్రి ఒంటెద్దు పోకడలకు పోకుండా అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. గత ఎన్నికలముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెంచిన జీతాలకు అదనంగా వెయ్యి రూపాయలు మాత్రమే పెంచినట్లు తెలిపారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వ కక్ష సాధింపు ధోరణి సిగ్గుచేటన్నారు.అంగన్‌వాడీలకు ఇచ్చేందుకు రూ.100 కోట్లు లేవని, వైజాగ్‌లో ప్రభుత్వ కార్యాలయాల పేరిట సొంత విలాసాలకి రూ.500 కోట్లు ఎలా ఖర్చు చేశారని ఆయన ప్రశ్నించారు. గతంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులపై కక్ష సాధింపుతో ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వాలు ఏమయ్యాయో ఒకసారి గుర్తుంచుకోవాలన్నారు. అంగన్‌వాడీలకు సరైన జీతాలు ఇవ్వకపోగా వారి చేత రకరకాల యాపులతో వెట్టిచాకిరి చేస్తున్నారని విమర్శించారు. న్యాయబద్ధంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మెకు అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పొదిలి యుటిఎఫ్ శాఖ రూ.5000, మరిపూడి మండలం కెల్లంపల్లికి చెందిన

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

వంకాయలపాటి శాంతి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని పదివేల ఆర్థిక సహాయాన్ని అంగన్‌వాడీలకు అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎస్‌కె.అబ్దుల్ హై, పెమ్మని బాల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, పొదిలి మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పాలడుగు వెంకటేశ్వర్లు, కెకెమిట్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాసర్ మహమ్మద్, కామేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, సంజీవరావు,నారాయణ రెడ్డి, ఓబుల్ రెడ్డి, గోనె శ్రీనివాసులు, ఆంజనేయ చౌదరి, పొదిలి తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బాదుల్లా, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత ఎస్‌కె ఖాదర్ బాషా పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు

సిఐటియు నగర కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సిఐటియు నగర కమిటీ 2024 కొత్త క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, టి మహేష్, ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసులు, జి రమేష్, ఆటో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు తంబి శ్రీనివాసులు, దాసరి రమేష్, మున్సిపాలిటీ యూనియన్ నాయకులు కె సామ్రాజ్యం, కె శ్రీనివాసరావు, యు రత్నకుమారి, ఆర్ రాములు, ఎం శ్రీలక్ష్మి, టి విజయ, పి కోటేశ్వరరావు, మెడికల్ రిప్స్ యూనియన్ కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

దర్శి నుంచే పోటీ చేస్తా: మద్దిశెట్టి శ్రీధర్

ప్రజాశక్తి-తాళ్లూరు

స్థానిక ఎమ్మెల్యే వేణుగోపాల్ స్వగ్రామం పామూరు మండలం లక్ష్మీనరసాపురంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ రోజున ఆత్మీయ సమ్మేళనం సాగింది. ఈ సందర్భంగా మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు శ్రీధర్, రవీంద్ర, వాసు పాల్గొని నియోజకవర్గంలోని నాయకులందరినీ పలకరించారు. అనంతరం సమ్మేళనంలో మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తమకు సహకరించిన నియోజకవర్గ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ తమకు సీటు ఇవ్వనందున వచ్చే 2024 ఎన్నికల్లో అందరి ప్రేమ, అభిమానాలతో దర్శి నియోజకవర్గంలోనే పోటీ చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు ఎంపీపీలు తాటికొండ శ్రీనివాసరావు, సుంకర బ్రహ్మానందరెడ్డి, బెల్లం చంద్రశేఖర్, తాళ్లూరు జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, జేఎన్‌టీ, శ్రీనివాసరెడ్డితో పాటు మేడికొండ జయంతి, యలమందరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అంజిరెడ్డి, దర్శి మండల సర్పంచ్‌లు రాము, శ్రీనివాసరావు,

దర్శి మండల సర్పంచ్‌లతో మద్దిశెట్టి శ్రీధర్

సత్యనారాయణ, సుబ్బారెడ్డి, విజయ్, మురళి, శ్రీనివాసరావు, కాశి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డేవిడ్‌రాజు

వైపాలెంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దాం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గం కాంగ్రెస్‌కు ఒకప్పుడు కంచుకోటగా ఉండేది. ఈ నియోజకవర్గంలో తిరిగి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చి జెండా ఎగురవేద్దామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలపర్తి డేవిడ్‌రాజు అన్నారు. సోమవారం యర్రగొండపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రెండున్నరేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. తాము ఐక్యంగా పని చేసి టిక్కెట్ ఎవరికి ఇచ్చినా గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు పాలపర్తి విజేష్‌రాజు, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు, ఏబిసి జిల్లా చైర్మన్ మస్తాన్, నాయకులు చిలకా అనిల్ కుమార్, దుగ్గెంపూడి బాలకృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు పెద్దపీట అభినందనీయం: మంత్రి

- అలరించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పొదిలి: నేటి ఆధునిక కాలంలో సాంప్రదాయ పండుగలను ఆర్భాటంగా జరుపుకోవడం అభినందనీయమే అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కొనియాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని గుండ్లసముద్రంలో మంగళవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు జరిగాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త, స్పేస్ విజన్ అధినేత తుమాటి వెంకట నరసింహారెడ్డి ఆర్థిక ప్రోత్సాహంతో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా మంత్రి సురేష్ హాజరయ్యారు. పోటీలను లాంఛనంగా ప్రారంభించి అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులందరమూ ఐక్యంగా పని చేసి మళ్లీ మన వైసీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసులురెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు తుమాటి వెంకట నరసింహారెడ్డి, ఆవుల కృష్ణారెడ్డి, ఆవుల సంజీవరెడ్డి, ఆనికాళ్ల వీరారెడ్డి, వాకా సుబ్బారెడ్డి, మర్రిపూడి మండల నాయకులు బోద రమణారెడ్డి, మాకినేని వెంకట్రావు, బీవీ భాస్కర్‌రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మర్రిపూడి సర్పంచ్ కదిరి భాస్కర్‌రావు, పొదిలి తాలూకా ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొమరోలు

మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో లఘు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పందనబోయిన ప్రసాద్, ట్రస్టు సభ్యులు మరియు గ్రామపెద్దలు పెద్ద గురవయ్య, నడిపి గురువయ్య, వెంకటరమణ, మజారి చెన్నయ్య, రామాంజనేయులు, పందనబోయిన కోటయ్య, మరియదాసు పాల్గొన్నారు.

పుల్లలచెరువులో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలంలోని పిఆర్‌సి తండా గ్రామంలో 38 కుటుంబాలు వైసీపీ నుంచి టిడిపిలో చేరాయి. టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో మంగళవారం ఆ పార్టీలో చేరారు. ఎరిక్షన్ బాబు వారిని పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్మోహన్‌రెడ్డి పాలన నచ్చకనే తాము టిడిపిలోకి చేరినట్లు వారు తెలిపారు. ఐదేళ్ల పాలనలో యర్రగొండపాలెం నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని అన్నారు. గూడూరి ఎరిక్షన్ బాబుని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లలచెరువు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని వేంపాడు గ్రామంలో వెల్ఫేర్ అండ్ డెవలప్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలబాలికలు ప్రదర్శించిన చైర్స్ ఆట, డాన్స్, వివిధ కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందించారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎం వీరయ్య చౌదరి, టి నారాయణస్వామి, ఎస్ కృష్ణ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాదరావు, లెక్చరర్ డి సత్యనారాయణ, కె పవన్, ఎం కొండలరావు, జి శేషగిరి, ఎం కోటేశ్వరరావు, ఎం వీరయ్య, బి హనుమంతరావు, సత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా 'కదిరి'

ప్రజాశక్తి-కనిగిరి

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన కదిరి భవాని నియమితులయ్యారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాంతియా కుమారి నియామక ఉత్తర్వులు జారీ చేయగా కదిరి భవాని ఉత్తర్వులును అందుకున్నారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని తెలిపారు. ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఆ గ్రామ యువత భావితరాలకు ఆదర్శం

ప్రజాశక్తి - పంగులూరు

బైటమంజులూరు. అదో పేద గ్రామం. అంతా వ్యవసాయ కూలి పనులు చేసుకుని బతికేవారు. కొంత మంది చిత్రపటాలను తీసుకొని బతుకు తెరువు కోసం గ్రామాల వైపు వెళ్లేవారు. గ్రామం మొత్తం పూరిళ్లు. అంద రూ అక్షరాశ్యులే. అక్కడ అరుగుల మీద, వీధుల్లో ఎక్కడ చూసినా జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు మాట్లాడే వారే. ఇది ఒకప్పుడు. ఇప్పుడు ప్రతి కుటుంబం నుంచి ఒకరో ఇద్దరో హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా స్థిరపడ్డారు. గ్రామంలోని తల్లిదండ్రుల ఆలనా, పాలన చూస్తూ, ఊళ్లో మంచి భవనాలు కట్టించుకున్నారు. దేశం లో ఎక్కడ ఉన్నా, ఆ గ్రామ యువకులు సంక్రాంతి పండుగ కు గ్రామానికి చేరుకొని పండుగను గ్రామం మొత్తం ఉత్సా హంగా, ఆహ్లాదకరంగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆ గ్రామానికి, ఆ గ్రామ ప్రజలకు ఏది అవసరమో దానిని గుర్తించి, తమ వంతు బాధ్యతగా అది ఏర్పాటు చేస్తారు. గ్రామంలో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి ముందడుగు వేస్తారు. భావితరాలకు ఈ తరం ఆదర్శంగా ఉండాలంటే ఏమి చేయాలో అది ఆలోచిస్తారు. అంతే

సమావేశమైన కమ్యూనిస్టు నేతల పేర్లున్న గ్రామయువత

కాదు దానిని ఆచరణలో పెట్టడానికి సమావేశాలు జరుపు తారు. అభిప్రాయాలు తీసుకుంటారు. మంచి విషయాల ను పదిమందికి వివరించి చెబుతారు. ఇది ప్రస్తుతం ఈ గ్రామ యువకులు చేస్తున్న పని. దీనికి కారణం ఆ గ్రామం లో మొదటి నుండి కమ్యూనిస్టు భావా లు కలిగిన వ్యక్తులు ఉండటం. ఉద్యమాలు నడపటం. కమ్యూనిస్టు సంప్రదా యాలను కొనసాగిం చటం. కమ్యూ నిస్టు పార్టీపైన, పార్టీ నాయకులపైన ఎంత అభిమానం, నమ్మకం ఉండేదో పుట్టిన వారి పిల్లలకు కమ్యూనిస్టు నాయకుల పేర్లు పెట్టడమే ఇందుకు ఉదాహరణ. మార్క్సిస్టు మహోపాధ్యా యులైన చారు మజుందార్, కారల్ మార్క్స్, లెనిన్, మావో, స్టాలిన్ ఇలాంటి పేర్లు తమ పిల్లలకు పెట్టి సుమారు 50, 60ఏళ్ల నాడే ఆ గ్రామ ప్రజలు తాము కమ్యూనిస్టులమని చెప్పుకున్నారు. ఆ పేర్లకు సార్థకత వచ్చే విధంగా, వారి తల్లి దండ్రుల అభిప్రాయాలను గౌరవించే విధంగా, ఈరోజు మార్క్సిస్ట్ మహోపాధ్యాయుల పేర్లు పెట్టుకున్న యువకు లు పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే గ్రామానికి చెందిన యువకు లంతా సంక్రాంతి పండుగకు బైటమంజులూరు గ్రామానికి వచ్చారు. పండుగను ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. అయితే సరికొండ మార్క్స్, సరికొండ లెనిన్, సరికొండ మావో, చక్రవర్తి స్టాలిన్, చక్రవరం చారు మజుందార్ సోమ వారం రాత్రి గ్రామంలో సమావేశం అయ్యారు. గ్రామం లోని యువతలో ఆదర్శవంతమైన భావాలను నెలకొల్పేం దుకు కృషి చేయాలని, ప్రతి ఏటా సంక్రాంతికి అమర వీరుల సభ నిర్వహించాలని, కమ్యూ నిస్టు ఉద్యమంలో, పోరాటాల్లో పాల్గొన్నవారు, మరణించిన అనేకమందిని మరిచిపోకుండా గ్రామంలో వారి స్మృతులను గుర్తు చేసుకునే విధంగా కృషి చేయాలని తీర్మానించు కున్నారు. గ్రామంలో ఆదర్శవంతమైన యువతను తయారు చేయాలని, ముందు తరాలకు మార్గదర్శకంగా నిలిచే విధంగా రూపకల్పన చేయాలని భావించారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - పంగులూరు

వచ్చే ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా వైసీపీ కార్యకర్తలు పనిచేయాలని వైసిపి ఇన్చార్జి పానెం చిన హనిమిరెడ్డి కోరారు. వైసిపి మండల కన్వీనర్ స్వయంపు హనుమంతరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చందలూరు నుండి ముళ్లూరి వెంకటేశ్వర్లు, అమ్మిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో 50కుటుంబాలు టిడిపి నుండి వైసిపీలో చేరారు. వీరికి హనిమిరెడ్డి వైసిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. తూర్పు కొప్పెరపాడు నుంచి బొడ్డు రాజేష్, మల్లె ప్రసాద్ ఆధ్వర్యంలో 100కుటుంబాలు, అలవలపాడు గ్రామానికి చెందిన గొట్టిపాటి నరేంద్ర ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, నూజిళ్లపల్లి గ్రామానికి చెందిన ధూళిపాళ్ల హరిబాబు నాయకత్వంలో 30కుటుంబాలు టిడిపి నుండి వైసిపీలో చేరారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు

వైసిపిలో చేరిన వారితో హనిమిరెడ్డి

పులికం కోటిరెడ్డి, వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బివి కృష్ణారెడ్డి, సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కోటా శ్రీనివాసరావు, జాగర్లమూడి వారి పాలెం సొసైటీ మాజీ చైర్మన్ జాగర్లమూడి ఎల్లమందరావు, వైసిపి నాయకులు గాదె బ్రహ్మారెడ్డి, గుడిపూడి రామారావు, ఎర్రం గోపాల్ రెడ్డి, అశోక్, రమణారెడ్డి, నాగేశ్వరరావు, అజీల్, హరిబాబు, గంగాధర్, సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.

అర్ధవంతమైన నాటికలకు ఆదరణ

ప్రజాశక్తి - పర్చూరు

సమాజాన్ని ప్రభావితం చేసే అర్థవంతమైన నాటికలకు ఆదరణ ఎక్కువని ప్రముఖ రంగస్థల నటులు జెట్టి హరిబాబు అన్నారు. మండలంలోని వీరన్నపాలెంలో జరుగుతున్న జాతీయ స్థాయి కళానికేతన్ కళాపరిషత్ నాటిక పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు. సోమవారం రాత్రి ప్రదర్శించిన నాటికలు చూపరులను మంత్రముగ్దుల్ని చేశాయి. తొలుత గుంటూరు అమరావతి ఆర్ట్స్ ప్రదర్శించిన "అమృత హస్తం" నాటిక ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. తదనంతరం పొన్నూరు రసఝరి ప్రదర్శించిన "కాపలా" నాటిక రక్షణ వ్యవస్థను మేల్కొల్పుతుంది. చివరిగా ప్రదర్శించిన "వెన్నెలొచ్చింది, ఇంద్ర ప్రస్థం" నాటికలు కూడ ప్రేక్షకులందరిని ఆలోచింపజేశాయి. మంగళవారం చివరి రోజున కొసల్యా సుప్రజా రామా, రాజు గారి గోచి నాటికలు ప్రదర్శింప బడతాయని నిర్వాహకులు బుచ్చయ్య చౌదరి, సిహెచ్

కళాకారులను సన్మానిస్తున్న గోరంట్ల శేషగిరిరావు

సాయిబాబు, కొల్లా శ్రీనివాసరావులు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వీరన్నపాలెంలో గోరంట్ల యమునా కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం కూడ నిర్వహించారు. ఈసందర్భంగా గోరంట్ల రామచంద్రరావు, యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి, చట్టినేని సాయిబాబు, జెట్టి హరిబాబు, పడిగల శివసత్యనారాయణలను నాగాట క్రాప్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ గోరంట్ల శేషగిరిరావు ఘనంగా సన్మానించారు.

యుటిఎఫ్, జెవివి ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - చీరాల

జెవివి, సిఐటియు, ఐద్వ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గొల్లపాలెం గంగమ్మ గుడి వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని అన్నారు. ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, కబడ్డి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులు అందజేశారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు గవిని నాగేశ్వరరావు, కె విరంజినేయులు, గుమ్మా శ్రీనివాసరావు, కుర్ర శ్రీనివాసరావు, జి సూరిబాబు, ఎన్ బాబూరావు పాల్గొన్నారు.

బాపట్ల : ఎడ్ల బల ప్రదర్శన వంటి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన పగడంవారిపాలెంకు చెందిన ఎడ్ల జత యజమాని కుంచాల వేదలతారెడ్డి పగడం రూ.30వేలు, 2వ స్థానం పోతురాజు కొత్తపాలెం మర్రిప్రోలు చెన్నకేశవరెడ్డి ఎడ్ల జతకు రూ.25 లు, బోయినవారిపాలెం గొర్ల యశ్వంత్ జతకు రూ.20వేలు నగదు బహుమతులను మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ అందజేశారు.

త్రిపురనేనికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

సాహిత్య ఉద్యమ రూపకర్త త్రిపురనేని

ప్రజాశక్తి - బాపట్ల

మూఢనమ్మకాలు మానవ మనుగడకు ప్రధాన ఆటంకమని ఉద్యమించిన కవుల్లో త్రిపురనేని రామస్వామి చౌదరి ఆదర్శనీయులని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాల్లో మంగళవారం జరిగిన త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి ఉత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శాస్త్ర సమ్మతమైన పద్ధతులను అనుసరించడం ద్వారా సాధించిన పురోగతి ప్రపంచ దేశాల్లో భారత దేశాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టగలదని ఉద్యమించిన త్రిపురనేని చిరస్మరణీయులని అన్నారు. కవి రాజుగా ప్రసిద్ధులైన త్రిపురనేని స్వాతంత్ర్య ఉద్యమంలో విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేందుకు అనేక దేశభక్తి గీతాలను రాసి ప్రచారం చేశారని అన్నారు. హేతువాద రచనలను తెలుగు సాహిత్యంలోకి ప్రవేశపెట్టిన తొలి కవిగా ఆయన ప్రసిద్ధులన్నారు. ఆయన రచనల్లో మానవతావాదం ఉట్టిపడుతుందని అన్నారు. అది విద్యార్థుల మానసిక వికాసానికి దోహద పడుతుంద న్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన త్రిపురనేని జస్టిస్ పార్టీ ద్వారా భారత పునర్వివన ఉద్యమంలో భాగస్వాములు అయ్యారన్నారు. తొలుత త్రిపురనేని చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె శ్రీనివాసరావు, కె నిర్మల్, రవి కుమార్ పాల్గొన్నారు.ం

వెండి మకర తోరణం బహూకరణ

ప్రజాశక్తి - ఇంకొల్లు

భీమేశ్వరునికి వెండి మకర బహుకరణ

స్థానిక పార్వతి సమేత భీ వేం శ్వరాల యంలో సం క్రాంతి పండుగ సందర్భంగా వెంకినవల్లి కృష్ణయ్య, నాగవరద్దని దంపతులు వెండి మకర తోరణం సోమవారం బహూకరించారు. శివాలయ పూజారి శివ సుబ్రహ్మణ్యం దాతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వర లింగానికి తోరణాన్ని అలంకరించారు. రూ.1.50లక్షల విలువ గల వెండి తోరణాన్ని దాతలు ఇవ్వటం ఆనందాయకమని ఇఒ మీనిశెటి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పి శివయ్య, ఎం శ్రీను, కె ప్రసాదు పాల్గొన్నారు.

క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న గొట్టిపాటి రవి

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -పంగులూరు

మండలంలోని కొండమంజులూరు గ్రామ తెలుగు యువత ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. మహిళలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుంటున్నారని అన్నారు. క్రీడలు శారీరక, మానసిక ధృడత్వానికి దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు, నిర్వాహక కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిల్లు స్వాధీనం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

అక్రమంగా మద్యం కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 18క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి సిఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని 7వ వార్డులో, మండలంలోని స్టువర్టురంలో చెరువు వద్ద దాచిన సారా తయారీకి ఉపయోగించే 300లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు : ఇంటిలో అక్రమంగా నిలువ చేసి విక్రయించడానికి సిద్ధం చేసిన మద్యం బాటిలను ఎస్ఐ శ్రీనివాసరావు స్వాధీనం చేసుకున్నారు. ఆమె వద్ద నుండి 26మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హరిప్రియను సన్మానిస్తున్న జనసేన నేత మహేష్

హరిప్రియ నరేష్‌కు సన్మానం

ప్రజాశక్తి - రేపల్లె

సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులుగా ఎంపికైన అల్లంశెట్టి హరిప్రియ నరేష్ దంపతులను జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ ఘనంగా సన్మానించారు. మండలంలోని ఉప్పూడి గ్రామానికి చెందిన జర్నలిస్టు అల్లంశెట్టి నరేష్ బాబు సతీమణి హరిప్రియ హైదరాబాద్‌లో ప్రముఖ న్యూస్ చానల్లో పనిచేస్తున్నారని తెలిపారు. న్యూస్ ప్రజెంటేషన్లో తనదైన శైలిలో జాతీయ, అంతర్జాతీయ అంశాలు, సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలను, ప్రభుత్వాల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేస్తూ సేవలు అందిస్తున్నారని చెప్పారు. అల్లంశెట్టి హరిప్రియ నరేష్ కేంద్ర సినిమాటోగ్రఫీకి సంబంధించి సెన్సార్ బోర్డు సభ్యులుగా ఎంపిక కావటం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణం అన్నారు. ఇలాంటి గౌరవప్రదమైన పదవులు నియోజకవర్గంలో అనేక మంది సాధించాలని, తద్వారా తమ సొంత గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థాయికి చేరుకునేవారిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతి కప్పు విజేత సౌత్ జోన్ సిసి చెన్నై జట్టు

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిశపాడు మండలంలో రావినూతల గ్రామంలో ఆర్ఎస్ సిపి ఆధ్వర్యంలో శ్రీ భ్రమరా 30వ సంక్రాంతి కప్ ఈనెల 9నుండి 16వరకు టోర్నమెంట్ జరిగింది. క్రికెట్ యుద్ధానికి 16న తెరపడింది. సంక్రాంతి కప్పును సౌత్ జోన్ సిసి చెన్నై జట్టు కైవసం చేసుకుంది. బహుమతులను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, శ్రీ భ్రమర టౌన్షిప్ అధినేత గల్లా రామచంద్రరావు, ప్రముఖ సినీ నటులు రఘుబాబు చేతుల మీదుగా రూ.3లక్షల నగదు, క్రికెట్ కప్పును సౌత్ జోన్ సిసి చెన్నై జట్టుకు అందించారు. ద్వితీయ బహుమతిని జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్టు కైవసం చేసుకుంది. రూ.2లక్షల నగదు, కప్పును గళ్ళ రామచంద్ర రావు, రఘుబాబు చేతుల మీదుగా అందుకున్నారు. తృతీయ బహుమతి శ్రీ సిసి చెన్నై జట్టు రూ.లక్ష నగదు, కప్పును ప్రముఖ సినీ నటులు రఘుబాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ టోర్నమెంటులో బెస్ట్ టోర్నమెంట్ గా శ్రీసీసీకి చెందిన తరుణ్ ఎన్నికయ్యారు. ఉదయం జరిగిన మ్యాచ్లో జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై, శ్రీ సిసి చెన్నై జట్ల మధ్య జరగగా ముందుగా బ్యాటింగ్ చేసిన జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 171 పరుగు చేసింది. నాలుగు వికెట్లను కోల్పోయి. జట్టులో కెవిన్ 50 బంతుల్లో 70పరుగులు చేశాడు. వీటిలో 6ఫోర్లు నాలుగు సిక్సులు ఉన్నాయి. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీసీసీ చెన్నై జట్టు 18ఓవర్లలో 16పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. దీంతో జిఎస్టి ఎక్సైజ్ చెన్నై జట్టు 65పరుగులతో విజయం సాధించారు. అనంతరం ఫైనల్ ఆడవలసిన చిక్కోలు చీట్స్ వైజాగ్ జట్టు అనివార్య కారణాలవల్ల పోటీలో పాల్గొన్న లేకపోయినందు వల్ల జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ జట్టు ఫైనల్ ఆడవలసి వచ్చింది. ఈ మ్యాచ్లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన సౌత్ జోన్ సెంట్రల్ సిసి జట్టు నిర్ణీత 12ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 125 పరుగులను చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ జట్టు నిర్నిత 12ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి 114పరుగులు మాత్రమే చేసి 11పరుగుల పరాజయాన్ని మూటగట్టుకుంది. దీంతో సంక్రాంతి 2024క్రికెట్ కప్పును సౌత్ జోన్ సిసి చెన్నై జట్టు కైవసం చేసుకుంది. సోమవారం ఫైనల్స్ కోసం ఆడిన మ్యాచ్లో శ్రీ సీసీ చెన్నై, చిక్కోలు చీట్స్ వైజాగ్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్లను కోల్పోయి 153 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చిక్కోలు 18.1 ఓవర్లలో నాలుగు వికెట్లను మాత్రమే కోల్పోయి 155 పరుగులు చేసి ఫైనల్కు అర్హత సాధించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్లో సౌత్ జోన్ సిసి జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్లు తలపడాగా మొదటి బ్యాటింగ్ చేసిన సౌత్ సిసి జట్టు నిర్ణీత 20ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి 169 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ జట్టు 20ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి 160పరుగులు చేసి తొమ్మిది పరుగులతో ఓటమిపాలైంది. దీంతో సౌత్ జోన్ సీసీ జట్టు ఫైనల్కు అర్హత సాధించాయి. అంటే ఫైనల్ మ్యాచ్ సిక్కోలు చిథిస్ వైజాగ్ సౌత్ జోన్ సిసి చెన్నై జట్ల మధ్య జరగవలసి ఉంది. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్సిపి అధ్యక్షులు కారుసాల నాగేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు, ఇరు ప్రక్కల గ్రామాల క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సంక్రాంతి కప్ అందజేస్తున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

బహుమతులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్, నాగులపాలెం ఆర్సిసి సంయుక్తంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్పై నడక పోటీలు నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ గుడి వద్ద ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్స్, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలైన దగుబాటి రాజ్యలక్ష్మి, ముద్దన శివ కుమారి, బత్తుల కరుణ, అడ్డగడ రాయుడులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్య క్రమంలో కొల్లా పద్మావతి, జెట్టి పద్మజ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆర్సీసీ కార్యదర్శి అడ్డగడ్డ చిన్న నాగేశ్వరరావు, కోశాధికారి కొల్లా శ్రీనివాసరావు, రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, తెళ్ల రమేష్ చంద్ర, పాబొలు వెంకన్న, కోమటి ఆంజనేయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహన్

గ్యాస్ నిక్షేపాలు ఆంధ్రుల హక్కు

ప్రజాశక్తి - బాపట్ల

కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతం, కేజీ బేసిన్లో లభ్యమయ్యే సహజ వనరులైన చమురు, గ్యాస్ నిక్షేపాలు ఆంధ్రులకే చెందాలని కేజీ బేసిన్ గ్యాస్ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. మంగళవారం కేజీ బేసిన్ చమురు గ్యాస్ ఆంధ్రుల హక్కు అనే అంశంపై జెవివి, కేజీ బేసిన్ గ్యాస్ పోరాట కమిటీ, రైతు సంఘం, ఇతర ప్రజాసంఘాలు సంయుక్తంగా స్థానిక ఎన్జీఓ హోంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. జెవివి రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో రాజమోహన్ మాట్లాడుతూ కృష్ణా, గోదావరి బంగాళా ఖాతంలో లభ్యమయ్యే సహజ వనరులు ఆంధ్రుల సొత్తుగా రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి తిరుమలరెడ్డి, ఫోరమ్ ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు, గోరంట్ల శాంతారామ్, కరణం రవీంద్రబాబు, తోట రామాంజనేయులు, ప్రముఖ చిత్రకారుడు జీవి, డివి రమణయ్య, ఆసోది శంకర్, ఎస్కె సుభాని, దాసరి లక్ష్మి, మీరా సాహెబ్, సురేష్ పాల్గొన్నారు.

భూ హక్కు చట్టంతో పేదలకు అన్యాయం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

నిరసన దీక్షల్లో న్యాయవాదులు

రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని పట్టణంలో న్యాయవాదులు నిరసన దీక్ష నిర్వహిస్తున్నారు. శిబిరంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి భీమా లీలా కృష్ణ, బాలకృష్ణ, సీనియర్ లాయర్ ఫిలిప్స్ మాట్లాడారు. పేద ప్రజలకు అన్యాయం జరిగే విధంగా ఉన్న భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని అన్నారు. న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఈ చట్టం చేశారని అన్నారు. ఈ చట్టం ప్రకారం లాండ్ టైటిలింగ్ ఆఫీసర్ను ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. లాండ్ టైటిల్ అధికారి సదరు అస్తి వివాదంలో ఉంటే ఆ అస్తి డిస్ప్యూట్ రిజిస్టర్లో పెడుతారు. అస్తి దారుడు డిస్ట్రిక్ట్ అథారిటీకి వెళ్లి అస్తి తనదని నిరూపించుకోవాల్సిన పరిస్తితి ఏర్పడు తుందన్నారు. సహజ న్యాయ సూత్రాలను చట్టంలో అనుసరించలేదని పేర్కొన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆస్తులను కబలించే పరిస్తితి వస్తుందని పేర్కొన్నారు. ఈ చట్టంపై అవగాహన లేకుండా చట్టం ఎలా తెస్తున్నారని న్యాయవాది జెడ్ బాషా అన్నారు. దీక్షలకు సీనియర్ న్యాయవాదులు నంబూరి నరసింహరావు, పులిపకా రఘురాం, బండి రామ్మూర్తి నాయుడు, నంబూరి సుబ్బయ్య చౌదరి మద్దతు పలికారు. కార్యక్రమంలో షేక్ కలీం, ఖాజా మొహమ్మద్, నాగ రాజు, శ్యామ్ సుందర్, వై నాయుడు పాల్గొన్నారు.

బాపట్ల : ప్రజలను ఇబ్బందులకు గురి చేసే భూమి హక్కు చట్టం రద్దు చేసే వరకు ప్రజాసంఘాలు పోరాడుతాయని అంటరాని కుల నిర్మూలన వ్యవస్థాపక అధ్యక్షుడు జి చార్వాక అన్నారు. భూమి హక్కు చట్టం రద్దుపై బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ గుదే రాజారావు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్లో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టంతో న్యాయవాదులకే కాదని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు తీరని నష్టం కలుగుతుందన్నారు. సమావేశంలో అఖిలభారత గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య, జనసేన మండల అధ్యక్షులు దాసరి ఏసుబాబు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ కొచ్చిర్ల వినయ్ రాజు, సిపిఐ కార్యదర్శి జల్లి భాగ్యశ్రీధర్, సిపిఐ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భీమా లీలా కృష్ణ, కార్యదర్శి ఇమ్మడిశెట్టి బాలకృష్ణ, న్యాయవాదులు జెడ్ భాషా, కిషోర్, జై భీమ్ భారత్ పార్టీ ఇన్చార్జ్ బడుగు భరత్, మహిళా నాయకురాలు దాసరి లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా ఇంకొల్లులో భీమేశ్వరస్వామి తెప్పోత్సవం

వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి - ఇంకొల్లు

సంక్రాంత్రి కనుమ సందర్భంగా గ్రామాల్లో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే తేపోత్సవం కనుమ రోజు నిర్వహించారు. స్థానిక నాగుల చెరువులో, నాగండ్ల పూర చెరువులో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంకొల్లులో చెక్కభజన ఆకట్టుకుంది. మ్యూజికల్ నైట్ ప్రోగ్రాంకు అనుమతులు పోలీసులు నిరాకరించారు. దీంతో పొరుగు ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు విచ్చేసిన గ్రామస్తులు, యువకులకు సందడి లేకుండా పోయిందని నిరాశ చెందారు. ఇంకొల్లు చెక్కభజన సందర్శకులకు కొంత ఊరటనిచ్చింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో శాంతి భద్రతల దృష్ట్యా మ్యూజికల్ నైట్ లాంటి ప్రోగ్రాములకు అనుమతులు లేవని, పైనుంచి ఆదేశాలు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ముగ్గులు, సైకిల్ పోటీలు నిర్వహించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్, జెవివి నేతలు

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - చీరాల

మండలిలో మాస్టారు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. పట్టణంలో ఆహ్వాన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. విద్యావేత్త విఠపు బాల సుబ్రహ్మణ్యం శాసన మండలిలో 2007 నుండి 2023 మార్చి వరకు చేసిన కొన్ని ఉపన్యాసాల సంకలనమే మండలిలో మాస్టారు పుస్తకం అన్నారు. 16ఏళ్ల పాటు శాసన మండలి సభ్యుడిగా, పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్గా, శాసన మండలి తాత్కాలిక చైర్మన్గా పనిచేశారని అన్నారు. మూఢనమ్మకాలు సైన్స్ పట్ల రచించిన పాటలను జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. యుటిఎఫ్ నాయకులు గవిని నాగేశ్వరరావు, కె వీరాంజనేయులు, గుమ్మ శ్రీనివాసరావు, కుర్ర శ్రీనివాసరావు, జె సూరిబాబు, పిచ్చియ్యా పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి - చీరాల

జాతీయ రహదారిపై క్రైస్తవుల రాస్తారోకో

క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసే విధంగా క్రీస్తు పుట్టుక, బైబిల్లోని అంశాలపై దుర్భాషలాడుతూ గవిని వారిపాలెంలో క్రీస్తు సువార్త ప్రకటిస్తున్న క్రైస్తవులపై హల్ చల్ చేస్తూ వీరంగం సృష్టించిన యువకులను అరెస్టు చేయాలని కోరుతూ ఈపూరుపాలెం వద్ద జాతీయ రహదారిపై క్రైస్తవులు బైఠాయించారు. ఘటనపై ఏపీ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ పట్టేమ్ డేవిడ్ మనోహర్, తోటవారిపాలెం నివాసి మార్పు దీనరాజు ఘటనకు కారకులైన యువకులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బైబిల్, క్రీస్తు తల్లి మరియమ్మ, క్రీస్తు పుట్టుక గురించి అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా క్రైస్తవుల మనో భావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన యువకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శాంతి యుతంగా గ్రామంలో సువార్త ప్రకటిస్తున్న నేపథ్యంలో ఇలాంటి ఘటన జరగటం విచారకరమని పలువురు పాస్టర్లు అన్నారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో చీకటి శక్తులు చీరాల ప్రాంతంలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని అన్నారు. పోలీసులు పూర్తి విచారణ చేసి నింధితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు పోలీసులు అరెస్టు చేయకపోవడంతో ఈపురపాలెం జాతీయ రహదారిపై క్రైస్తవులు, పాస్టర్లు, దళిత సంఘ నాయకులు రాస్తారోక చేశారు. ప్రశాంతంగా ఉండే చీరాల వంటి ప్రాంతాల్లో కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే అల్లరి మూకలను అరెస్టు చేసేవరకు నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఆందోళనతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అల్లరి మూక అరెస్టుకు సిఐలు నిమ్మగడ్డ సత్యనా రాయణ, శేష గిరిరావు, సోమశేఖర్, ఈపురపాలెం ఎస్సై జనార్ధన్ బుధవారం మధ్యాహ్నం వరకు సమయాన్ని కోరడంతో క్రైస్తవులు నిరసనను తాత్కాలికంగా విరమించారు. కార్యక్రమంలో పాస్టర్లు, ప్రజా వేదిక అధ్యక్షులు గుమ్మడి ఏసు రత్నం, దళిత నాయకులు కంచర్ల చిట్టిబాబు, రత్న ప్రకాష్, డేటా దివాకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న డిఎం శ్రీనివాసరావు

రోడ్డు భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

రోడ్డు భద్రత వారోత్సవాలు ఈ నెల 15నుంచి ఫిబ్రవరి 14వరకు నిర్వహిస్తున్నామని ఆర్టీసి మేనేజర్ టీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కొత్త బస్టాండులో డ్రైవర్లు, కండక్టర్లకు రోడ్డు బద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు రోడ్డుపై డ్రైవింగ్ ఎలా చేయాలి, సేఫ్టీగా గమ్యస్థానాలు చేరాలనే విషయాలపై వివరంగా చెప్పారు. ఇందులో భాగంగా మెకానిక్లు బస్సుల కండిషన్ ఏవిధంగా ఉంచాలి, కండిషన్లో ఉన్న వెహికల్తో డ్రైవర్ ఉద్యోగం చేసినప్పుడు సేఫ్టీ ఏవిధంగా ఉంటుందో తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సెక్రెటరీ మాట్లాడుతూ భద్రతకు సంబంధించిన విషయాలను తెలిపారు.

మళ్లీ అధికారం కోసం మోడీ కుయుక్తులు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రధాని మోడీ మూడోసారి అధికారంలోకి రావడం కోసం రకరకాల కుయుక్తులు పన్నుతున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని మైనంపాడులో విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల కోలాట ప్రదర్శనను సోమవారం శ్రీనివాసరావు ఆద్యంతం తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత పెద్దలు చెప్పినా వినకుండా మోడీ మళ్లీ అధికారంలోకి రావడం కోసమే రకరకాల కుయుక్తులు పన్నుతున్నట్లు తెలిపారు. అధికారం లోకి రావడం కోసమే అయోధ్యలో రామాలయం ప్రారంభించడం ఇందుకు నిదర్శనమన్నారు. దేశ ప్రజలు అనేక రకాల సమస్యలతో బాధపడుతుంటే వాటిని పట్టించుకోకుండా వాటిని గాలికొదిలేశారని ఆయన విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం గత 36 రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా లేదని

కోలాటాన్ని తిలకిస్తున్న శ్రీనివాసరావు

విమర్శించారు. సమస్యల పరిష్కారం గురించి పట్టించు కోకుండా అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తానడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీల ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం అంగన్‌వాడీలు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని సంతకం చేసి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం కోలాటం ప్రదర్శించిన మహిళలను అభినందించారు. కోలాట ప్రదర్శనకు శిక్షణనిచ్చిన కోలాటం మాస్టారు శ్రీను, డప్పు మాస్టర్ నాగేశ్వరరావును శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎస్‌కె. మాబు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కిలారి పెద్దబ్బాయి, గుండవరపు సుబ్బారావు, కరిచేటి హనుమంతరావు, ఎ. భగత్ సింగ్, ఎస్‌కె. నాయబ్, ఎస్‌కె.కమాల్, టి. సుబ్బారావు, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంక్రాంతి ఆట పోటీలు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక గాంధీ నగర్‌లోని భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం వద్ద డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆటలుపోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎస్‌కె పీరు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, సిఐటియు మాజీ నాయకులు పూనాటి ఆంజనేయులు, జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ మాట్లాడుతూ ఐక్యత కోసం యువజన మైత్రి కి బాటలు నినాదంతో ప్రతి ఏడాది ప్రజల సంతోషం కోసం ఆటలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు దాసు గురవయ్య శ్రీను, జబ్బార్ పాల్గొన్నారు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

ముగిసిన వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాలుగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు మాజీ సర్పంచి మాదాసు కష్ణమూర్తి జయంతి మరియు సంక్రాంతి సందర్భంగా మాదాసు కష్ణమూర్తి మెమోరియల్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం నిర్వహించిన ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మాదాసు మెమోరియల్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వితలకు రూ.10,116 రూపాయలు వైసిపి గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు అందజేశారు.కనపర్తి శ్రీరామ్ యూత్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు రూ. 7,116 సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అధినేత బెల్లం కొండ రామకష్ణ ,కండ్లగుంట జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు రూ. 5,116 ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొంజేటి సురేష్ బాబు అందజేశారు. ప్రవీణ్ ఫ్రెండ్స్ నాల్గవ స్థానంలో నిలిచింది. విజేతలకు రూ.3,116 ఎంపిటిసి మున్నంగి వెంకట్రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంట్యాల శ్రీనివాసరావు, ఏలీషా, రమణ, సర్పంచి దేవరకొండ జయమ్మ, సొసైటి చైర్మన్ ఉప్పుగుండూరి శ్రీనివాసప్రసాదు, కొంజేటి వెంకట సురేష్ బాబు, మాదాసు రాంబాబు, ప్రవీణ్ , నాగరాజు, అమరా సబ్బారావు, యానాది, వజ్రంబాబు, ఎంపిటిసిలు అనరాధ, మున్నంగి వెంకట్రావు పాల్గొన్నారు.

బీసీకాలనీలో ఆటల పోటీలు

ప్రజాశక్తి- మద్దిపాడు

సంక్రాంతి పండుగ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మద్దిపాడు బీసీ కాలనీ, కొలచనకోట ఎస్‌టి కాలనీల్లో ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, కుండ కొట్టుట,కోలాటం, డాన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల కార్యదర్శి బొబ్బ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శారద, వీరాంజనేయులు యువకులు, మహిళలు, గ్రామపెద్దలు, కాలనీల వాసులుపాల్గొన్నారు.

క్రికెట్ విజేత దేవరపాలెం జట్టు

ప్రజాశక్తి-చీమకుర్తి

బహుమతులు అందజేస్తున్న మారం వెంకారెడ్డి

పాటిమీదపాలెం అంబేద్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో దేవరపాలెం టీమ్ మొదటి బహుమతి సాధించింది. విజేతలకు వైసిపి అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మారంవెంకారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోకూరి రామకృష్ణారెడ్డి, అశోక్,మేళం వెంగన్న, కూడల అంజయ్య, కూడల యలమంద, దశరథరామిరెడ్డి,నాని,పెద్ద అంజయ్య ,పులి రామాంజి, చందు, రవితేజ, బ్రహ్మయ్య,అరవింద్,రాజు, సాయి పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

నాగులుప్పలపాడు : సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని ఉప్పుగుండూరులోని రుక్మిణి సత్యభామ శ్రీవేణుగోపాల స్వామి ఆళ్వారాజు తెప్పోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నలమలపు అంజమ్మ,కష్టారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు విచ్చేసి తెప్పోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దివి శ్రీధర్‌బాబు, వైసిపి గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్ బాబు ,పెంట్యాల శ్రీనివాసరావు, నలమలపు కష్టారెడ్డి, వెంకటేశ్వర్లు, ఇఒ శ్రీనివాసరావు, పాండురంగయ్య పాల్గొన్నారు.

ఆటలపోటీలు ఐక్యతకు చిహ్నం : జెవివి

చీమకుర్తి : ఆటల పోటీలు ఐక్యతకు చిహ్నమని జెవివి జిల్లా నాయకుడు నల్లూరి వెంకటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని నిప్పట్లపాడులో సిఐటియు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఆదినారాయణ, సిఐటియు నాయకులు నుగ్గు శ్రీను, ఎం.లక్ష్మయ్య,సురేష్, డివైఎఫ్ఐ నాయకులు ప్రేమకుమార్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల

ఎడ్ల పోటీలు ప్రారంభం

కొత్తపట్నం : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రమైన కొత్తపట్నంలో టిడిపి ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రస్థాయిలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మంగళవారం ప్రారంభించారు. కడప,నెల్లూరు, ప్రకాశం జిల్లా ఎడ్ల జతలు ఈపోటీల్లో పాల్గొన్నాయి. తొలుత కడప జిల్లాకు చెందిన ఎడ్ల జత 1,938 అడుగులు దూరాన్ని 12 నిమిషాలలో లాగింది. పోటీల నిర్వాహకుడు మాజీ జడ్‌పిటిసి మేడా సుబ్బారావును దామచర్ల జనార్దన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గేనం సుబ్బారావు, శ్రీనివాసులు రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి ,మేకల జకరయ్య పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

కొండపి : మండల పరిధిలోని చినవెంకన్నపాలెం గ్రామానికి చెందిన 35 కుటుంబాల వారు ఎమ్మెల్యే డాక్టర్ శ్రీ బాలవీరాంజనేయస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరినవారిలో సింగు చంద్రశేఖర్, కాకి వెంకటేశ్వర్లు, ఇస్తర్ల కుర్మారావు, విస్తర్ల జగన్, కొండసింగు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

బహుతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ముగ్గుల పోటీలు

చీమకుర్తి : సంక్రాంతి పండుగ సందర్భంగా టిడిపి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీమకుర్తికి చెందిన కె.విజయలక్ష్మి మొదటి స్థానంలో నిలిచి రూ. 1లక్ష నగదు గెలుపొందింది. చీమకుర్తికి చెందిన పి.సుజాత ద్వితీయ బహుమతిగా రూ. 50వేలు, సంతనూతలపాడుకు చెందిన కె.సుబ్బలక్ష్మి తృతీయ బహుమతిగా రూ.25వేలు గెలుపొందారు. కబడ్డీ పోటీలలో వైజాగ్ జట్టు మొదటి ,ప్రకాశం జట్టు ద్వితీయ, ఇంకొల్లు జట్టు తృతీయ ,నెల్లూరు జట్టు నాల్గవ,ఓడరేవు జట్టు ఐదవ, గొట్లగట్టు జట్టు 6వ స్థానంలో నిలిచాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్యే విజయకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు మన్నంప్రసాదు,జి రాఘవరావు, పూనాటి వెంకటరావు, కాట్రగడ్డ రమణయ్య,ఉన్నం సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, నాగరాజు, శివరంజని పాల్గొన్నారు.

ఐక్యత కోసం ఆటలు

కొండపి: ఐక్యత కోసం ఆటలు యువజన మైత్రికి బాటలు అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కెజె. మస్తాన్ తెలిపారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, మహిళ సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై.లక్ష్మయ్య, వై.రూబెన్, జి.వందనం, మల్లెల చినపేతురు తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో బహుమతులు అందజేస్తున్న నాయకులు